క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం


క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మన్యుసూక్త హోమం


ఆంజనేయ స్వామి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

మహారాణిపేట: మెయిన్‌రోడ్డులోని ఆంజనేయ స్వామి వారి దేవాలయంలో వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం మన్యుసూక్త హోమం ఘనంగా జరిగింది. ఈ హోమం వల్ల నరఘోష, శత్రు ఘోష, రుణబాధ, గ్రహదోష శాంతి చేకూరుతుందని దేవస్థానం ఈవో అల్లు జగన్నాథం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ హోమం నిర్వహించారు. భక్తులు రూ. 516 చెల్లించి హోమంలో పాల్గొన్నారని, హోమం అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు భక్తులకు అందజేసినట్లు ఈవో తెలిపారు.

శభాష్.. వలంటీర్


కేజీహెచ్‌లో కామేశ్వరరావుకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ దేవికారాణి

మహారాణిపేట: తెల్లవారక ముందే లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పెన్షన్ అందిస్తున్న వలంటీర్లను చూశాం. కానీ ఆరోగ్య సమస్యలు, ఇతరత్రా కారణాలతో ఇళ్లలో లేని వారిని వెతుక్కుని మరీ ఎంత దూరంలో ఉన్నా వెళ్లి మరీ కొంత మంది వలంటీర్లు పెన్షన్ అందిస్తున్నారు. జీవీఎంసీ జోన్–4లో మట్ట వెంకటప్పయ్య సచివాలయ పరిధిలో కామేశ్వరరావు అనే వృద్ధుడు ఆరోగ్య సమస్యల కారణంగా కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. అయితే సదరు సచివాలయ వలంటీర్ దేవికారాణి ఆ విషయాన్ని తెలుసుకుని కేజీహెచ్‌కు వెళ్లి మరీ కామేశ్వరరావుకు పెన్షన్ అందజేశారు. కష్టకాలంలో ఉన్న సమయంలో ఆస్పత్రికి వచ్చి మరీ పెన్షన్ అందజేసిన వలంటీర్ దేవికారాణికి, నేరుగా పెన్షన్ అందజేసే విధానాన్ని ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

దక్షిణలో పర్యటించిన శ్రీభరత్

అల్లిపురం: దక్షిణ నియోజకవర్గంలో తెలుగు దేశం పార్టీ పార్లమెంటరీ ఇన్‌చార్జి శ్రీ భరత్ శుక్రవారం మీ కోసం.. మీ భరత్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గం ఇన్‌చార్జి గండి బాబ్జితో కలిసి 34వ వార్డు పరిధి అచ్చియ్యమ్మపేటలో గల ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం లక్ష్మీదేవిపేట, జెండాచెట్టు, భూపేష్‌నగర్, తారకరామ కాలనీ వరకు వార్డు నాయకులు, కార్యకర్తలతో కలిసి పర్యటించారు.

పార్కింగ్ సమస్యకు చెక్

విశాఖ నగరం విస్తరిస్తోంది. ముఖ్యంగా జగదాంబ ఏరియా రోజురోజుకు రద్దీగా మారుతోంది. దీంతో పార్కింగ్ సమస్య వేధిస్తోంది. అయితే మల్టీలెవల్ కార్ పార్కింగ్ ఈ సమస్యకు చక్కటి పరిష్కారంగా నిలుస్తోంది. జగదాంబ జంక్షన్‌కు కూతవేటు దూరంలో దేశంలోనే తొలి మెకనైజ్డ్ ఆటోమేటిక్ కార్ పార్కింగ్ గత ఏడాది ప్రారంభమయింది. ఇక్కడ తమ వాహనాలు పార్క్ చేసుకోవాలంటే ఆయా వాహనాల యజమానులు జీవీఎంసీ నిర్దేశించిన రెండు గంటలకు రూ. 30, ఆపై ప్రతి గంటకు రూ. 10 చొప్పున చెల్లిస్తే సరిపోతుంది. ఈ సదుపాయం ఏర్పాటుతో జగదాంబ జంక్షన్‌లో రద్దీ సమస్యకు కొంత మేర తెర పడినట్లు చెప్పొచ్చు.

- జగదాంబ సెంటర్‌లో తొలి మెకనైజ్డ్ ఆటోమేటిక్ కార్ పార్కింగ్
- రెండు గంటల పార్కింగ్‌కు రూ.30 మాత్రమే
- సరాసరి రోజుకి 30 నుంచి 40 కార్లు పార్కింగ్

డాబాగార్డెన్స్: దేశంలోనే తొలి మెకనైజ్డ్ ఆటోమేటిక్ కార్ పార్కింగ్ నగర ప్రజలకు అందుబాటులోకి వచ్చి ఏడాదైంది. ఒకప్పుడు జగదాంబ జంక్షన్లో కారు పార్క్ చేయాలంటే అవస్థలు పడేవారు. కిలోమీటర్ దూరంలో పార్కింగ్ చేసి నడుచుకుంటూ జంక్షన్‌కు చేరుకునేవారు. అంతేకాదు.. జంక్షన్ పరిసర ప్రాంతాల్లో ఎక్కడైనా కారు పార్క్ చేస్తే పోలీసులు ఆగమేఘాలపై వచ్చేవారు. టోయింగ్ వాహనం ద్వారా నగర శివారుకో.. లేదా స్టేషన్ పరిధిలో విశాలమైన ప్రదేశం వద్దకో తీసుకెళ్లి వదిలేవారు. అక్కడితో ఆగకుండా జంక్షన్లో కారు పార్క్ చేసినందుకు జరిమానాలు కూడా విధించేవారు. ఇప్పుడు ఆ భయం లేదు. కారు పార్కింగ్‌కు చింతే లేదు. జగదాంబ జంక్షన్‌కు హుందాగా వచ్చి అక్కడ (ఎంఎల్‌సీపీ వద్ద) ఏర్పాటు చేసిన మల్టీ లెవెల్ కారు పార్కింగ్‌లో వాహనాన్ని దర్జాగా పార్కింగ్ చేసి.. పనులు పూర్తి చేసుకుని.. హాయిగా ఇంటికి వెళ్లొచ్చు. నగర నడిబొడ్డున జగదాంబ జంక్షన్‌కు కూతవేటు దూరంలో దేశంలోనే తొలి మెకనైజ్డ్ ఆటోమేటిక్ కార్ పార్కింగ్ గత ఏడాది ప్రారంభమైన సంగతి తెలిసిందే. 367 చదరపు మీటర్ల విస్తీర్ణంలో జగదాంబ జంక్షన్లో నిర్మించిన ఎంఎల్‌సీపీలో 100 కార్లు పార్కింగ్ చేసుకోవచ్చు. రూ.11.45 కోట్లతో మొత్తం ఆరు లెవెల్స్‌లో పార్కింగ్ చేసుకునేలా స్ట్రక్చర్ నిర్మాణం జరిగింది. ఇందులో పార్కింగ్ చేసుకునేందుకు జీవీఎంసీ నామమాత్రపు ధరలు నిర్ణయించింది. రెండు గంటల సేపు పార్కింగ్ చేస్తే రూ.30 రుసుం వసూలు చేయాలని, రెండు గంటలు దాటిన తర్వాత ప్రతి గంటకు అదనంగా రూ.10 వసూలు చేయాలని నిర్ణయించారు. ఫలితంగా కార్ల యజమానులు ఇక్కడ పార్కింగ్ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. 100 కార్లు పార్కింగ్ చేసే కెపాసిటీ ఉంది. అయితే ప్రస్తుతం రోజుకి సరాసరి 30 నుంచి 40 కార్లు పార్కింగ్ అవుతున్నాయి. ఆదివారం, పండగ రోజుల్లో మాత్రం ఆ సంఖ్య 60 నుంచి 70కి చేరుతుంది.


జగదాంబ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన మల్టీ లెవల్ కార్ పార్కింగ్

ట్రాఫిక్‌కు చెక్..

మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ ఏర్పాటైన నాటి నుంచి జగదాంబ జంక్షన్ పరిసర ప్రాంతాల్లో కొంతమేర ట్రాఫిక్‌కు చెక్ పెట్టినట్టయింది. నగరం నుంచే కాక జిల్లా.. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వ్యాపారం.. ఆసుపత్రి.. వ్యక్తిగత పనుల కోసం వచ్చే వారు గతంలో పార్కింగ్ చేయాలంటే అనేక ఇబ్బందులు పడేవారు. ఎంఎల్‌సీపీ ప్రారంభం తర్వాత కారు పార్కింగ్ సులువైంది. నామమాత్రపు రుసుం వసూలు చేస్తుండడంతో కార్ల యజమానులు అక్కడే పార్కింగ్ చేస్తున్నారు. ఫలితంగా పరిసర ప్రాంతాల్లో నిత్యం రద్దీగా ఉండే జంక్షన్ల వద్ద ట్రాఫిక్‌కు కొంతమేర చెక్ పెట్టినట్టయింది.

అంబులెన్స్‌లకు లైన్ క్లియర్..

కింగ్‌జార్జ్ ఆస్పత్రితో పాటు పలు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాలంటే అంబులెన్స్ డ్రైవర్లు జగదాంబ జంక్షన్ వద్ద ఇబ్బంది పడేవారు. కుయ్‌కుయ్ మంటూ 108 వాహనాలు హారన్లు మోగిస్తున్నా.. ట్రాఫిక్ రద్దీ కారణంగా అత్యవసర అంబులెన్స్‌లు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయేవి. అలాగే కార్ పార్కింగ్ కూడా జగదాంబ పరిసర ప్రాంతాల్లో గల గల్లీలో ఏర్పాటు చేసేవారు. ఫలితంగా అంబులెన్స్‌లు ఆసుపత్రులకు వెళ్లేటప్పుడు అవస్థలు పడేవి. ప్రస్తుతం ఆ పరిస్థితికి చెక్ పడినట్టయింది.

అందరికీ ఉపయోగకరంగా..

జగదాంబ జంక్షన్‌కు సమీపంలో ఉండే చాలా మంది వ్యాపారులు మల్టీ లెవెల్ కార్ పార్కింగ్‌ను సద్వినియోగం చేసుకుంటున్నారు. వీరు మంత్లీ, రెగ్యులర్‌గా పార్కింగ్‌ను ఉపయోగించుకుంటున్నారు. ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు పార్కింగ్ సదుపాయం ఉండడంతో వ్యాపారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం


ప్రజాదర్బార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు

అల్లిపురం: ప్రజాదర్బార్‌లో ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. 34వ వార్డు అచ్చియ్యమ్మపేట జంక్షన్‌లో గల మనోరమా థియేటర్ వద్ద శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌కు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. నగరంలో చిరువ్యాపారులు తమ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ మేరకు ఆయన జీవీఎంసీ కమిషనర్‌తో మాట్లాడి ఆయా సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, స్టేట్ ఫారెస్ట్ డైరెక్టర్, 29 వార్డు అధ్యక్షుడు జేసీజే ఇన్‌చార్జి పీతల వాసు, సీనియర్ నాయకులు లండా రమణ, లింగం శ్రీనివాసరావు, దూడ అప్పారావు, వాసుపల్లి నారాయణ, ఆదివిష్ణు, కోరాడ సురేష్, బోణి దేవ, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

విద్యార్థుల మనోవికాసానికి పలు కార్యక్రమాలు

డాబాగార్డెన్స్: ఈ దేశానికి మీరు చాలా అవసరం. మానసిక ఒత్తిడిలో సమాజం మీ వెంటే ఉంటుంది. ఆత్మహత్యలకు పాల్పడొద్దు. బలవన్మరణాల నివారణకు తబుల రాసా విస్తృత కార్యక్రమాలు చేపట్టనుందని ఆ సంస్థ వ్యవస్థాపక చైర్మన్, ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ విజయభాస్కర్ బోనం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సామాజికవేత్తలు, పలువురు సైకాలజిస్ట్‌లతో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఇంటర్మీడియట్ ఫలితాల్లో విఫలమైన విద్యార్థులు బలవన్మరణాలకి పాల్పడ్డారని తెలిపారు. ఎన్‌సీబీఆర్ సర్వే ప్రకారం ప్రతి 46 నిమిషాలకు ఒక విద్యార్థి..అంటే సుమారుగా రోజుకి 36 మంది..ఏడాదికి 12,400 మంది విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడతున్నారని, అందులో 14 నుంచి 24 ఏళ్ల వయస్సు వారే ఈ బలవన్మరణాలకు పాల్పడతున్నట్టు తెలిపారన్నారు. వీటిని శాశ్వతంగా నిర్మూలించాలంటే విద్యాసంస్థలోనూ, విద్యా విధానంలోనూ, మరీ ముఖ్యంగా తల్లిదండ్రులు, విద్యార్థులు, టీచర్లు అవగాహన పొందాలన్నారు. విద్యార్థుల్లో మనోధైర్యాన్ని పెంచే విధంగా, అలాగే పిల్లలు ఇంటిలిజెన్స్‌తో పాటు ఎమోషనల్ ఇంటిలిజెన్స్ సోషల్ ఇంటెలిజెన్స్ కూడా అభివృద్ధి చేయడం చాలా అవసరమన్నారు. సైకాలజిస్ట్‌చే మెంటల్ హెల్త్ అవగాహన కార్యక్రమాలు తరచుగా నిర్వహించాలని నిర్ణయించినట్టు చెప్పారు. అందుకు తబుల రాసా సంస్థ ద్వారా ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు తెలిపారు. భవిష్యత్‌లో వివిధ విద్యా సంస్థలు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, తల్లిదండ్రులతను చైతన్యపరిచే కార్యక్రమాలు, నివారణ మార్గాలు విస్తృతంగా చేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సామాజికవేత్త జీఏ నారాయణరావు, డాక్టర్ రాజ్యలక్ష్మి, కె. నిరుపమా, శ్రీదేవి, ఇమ్రాన్ పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

కనకమహాలక్ష్మి సన్నిధిలో పౌర్ణమి పూజలు


లక్ష్మీ హోమంలో పాల్గొన్న ఉభయదాతలు

డాబాగార్డెన్స్: బుద్ధ పూర్ణిమను పురస్కరించుకుని కనకమహాలక్ష్మి దేవస్థానంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీచక్రనవవర్ణార్చన లక్ష్మీ హోమంలో 8 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న మేయర్


కప్పస్తంభానికి మొక్కుకుంటున్న హరివెంకటకుమారి దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామిని శుక్రవారం నగర మేయర్‌గొలగాని హరి వెంకటకుమారి దంపతులు దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. వారి పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు.

సత్యదేవుని ఆలయంలో పౌర్ణమి పూజలు

ఇసుకకొండకు పోటెత్తిన భక్తులు

డాబాగార్డెన్స్ : నగరంలోని ఇసుకకొండ (బాబాజీ కొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. బుద్ధ, వైశాఖ పౌర్ణమి సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు జరిపారు. వేకువ జాము 4 గంటల నుంచే భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. నగరం నుంచే గాక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి దర్శనానికి తరలివచ్చారు. ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు జరిగాయి. ఆలయ ఈవో బుద్ధ మహాలక్ష్మీ నగేష్ పర్యవేక్షించారు. సాయంత్రం వరకు భక్తుల తాకిడి కనిపించింది. భక్తుల సౌకర్యార్థం సర్వదర్శనంతో పాటు రూ.20, రూ.200, రూ.300 టికెట్లు అందుబాటులో ఉంచారు. మౌలిక సదుపాయాలు కల్పించారు. వేకువజాము 4 గంటలకు అనివెట్టి మండపం వద్ద సామూహిక వ్రతాలు, ప్రత్యేక పూజలు జరిపారు. ధ్వజస్తంభ పూజలు జరిగాయి.


రమా సహిత సత్యనారాయణ స్వామి

ఘనంగా మార్క్స్ జయంతి

అల్లిపురం: ఆర్థిక శాస్త్రవేత్త, శాస్త్రీయ కమ్యూనిజం ప్రతిపాదితుడు కార్ల్‌మార్క్స్ అని సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి కొనియాడారు. కార్ల్‌మార్క్స్ 205వ జయంతి సందర్భంగా శుక్రవారం సాయంత్రం సీపీఐ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని కార్ల్‌మార్క్స్‌కు నివాళులు అర్పించారు. మానవ జాతి చరిత్ర అంతా వర్గ పోరాటాల చరిత్ర అని ఆనాడే విశ్లేషణ చేసిన గొప్ప సిద్ధాంతకర్త అని, కమ్యూనిస్టు ప్రణాళిక తయారు చేసిన మహనీయుడు, పెట్టుబడి గ్రంథం రచయిత, ప్రపంచ కార్మికులారా ఏకంకండి అని సందేశం ఇచ్చిన గొప్ప తాత్వికుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, బీసీహెచ్ మసేను, ఎ.విమల, ఎస్‌కె రెహమాన్, కసిరెడ్డి సత్యనారాయణ, జి.రాంబాబు, జీఎస్ అచ్యుతరావు, జి.కాసులరెడ్డి, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.


కార్ల్‌మార్క్స్‌కు నివాళులు అర్పిస్తున్న జేవీ సత్యనారాయణమూర్తి

డ్రైవర్లకు న్యాయం చేయాలి


జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న క్లాప్ డ్రైవర్లు


జేసీ విశ్వనాథన్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

మహారాణిపేట/అల్లిపురం : క్లాప్ డ్రైవర్లకు లేబర్ కమిషనర్ ఆదేశాల మేరకు రూ.18,500 వేతనం అమలు చేయాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు పి.వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు, ఉపాధ్యక్షుడు సీరపు రమణ, సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మధ్యాహ్నం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద క్లాప్ డ్రైవర్ల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పెంచిన వేతనం అమలు చేయడంతో పాటు జీవీఎంసీ పాలకవర్గ కౌన్సిల్ అజెండాగా పెట్టి ఆమోదించాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. లేని ఎడల ఈ నెల 10 తర్వాత నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు హెచ్చరించారు. తమ సమస్య పరిష్కారం కోరుతూ క్లాప్ డ్రైవర్లంతా జిల్లా జాయింట్ కలెక్టర్ కెఎస్ విశ్వనాథన్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం వెంటనే రూ.18,500 చెల్లించాలని జీవీఎంసీ, కాంట్రాక్టర్‌కు ఉత్తర్వులు ఇప్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బల్లిగిరి వెంకన్న తిరు కల్యాణోత్సవాలు


పూర్ణాహుతిలో పాల్గొన్న కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు, ఈవో రమాబాయ్ తదితరులు


సహస్ర ఘటాభిషేకంలో పాల్గొన్న భక్తులు


స్వామి వారికి చక్రస్నానం చేయిస్తున్న అర్చకుడు

అల్లిపురం: బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరు కల్యాణోత్సవాలు శుక్రవారంతో ముగిసాయి. గత నెల 30న కల్యాణోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శుక్రవారం అష్టోత్తర శత కలశస్నపనం, తిరుమంజన సేవ, వసంతోత్సవం, చక్రతీర్థం నిర్వహించారు. ఆలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ మండపంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులు ఘటాలలో నీటితో మూలవిరాట్టుకు పంచామృతాభిషేకాలు, విశేష పూజలు, అభిషేకం నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కల్యాణోత్సవాలు ముగింపు సందర్భంగా చక్రస్నానం భక్తి శ్రద్ధలతో చేపట్టారు. సాయంత్రం ధ్వజావరోహణం చేపట్టారు. ఈ సందర్భంగా భక్తుల గోవింద నామస్మరణంతో బల్లిగిరి మార్మోగింది. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి పల్లంరాజు, ఆలయ ఈవో జీవీ రమాబాయ్, సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం సహస్రదీపాలంకరణ సేవ, నక్షత్ర హారతి, సప్త హారతులు నిర్వహించారు.

నేడు పుష్పయాగం..

కల్యాణోత్సవాల్లో భాగంగా శనివరం సాయంత్రం పుష్పయాగం ఘనంగా నిర్వహించనున్నట్లు ఈవో రమాబాయ్ తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారి ఊంజల్ సేవ అత్యంత వైభవంగా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పాల్గొని తరించాలని ఆమె కోరారు.

ఘనంగా రక్షణగిరి పుణ్యక్షేత్ర మహోత్సవం

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ కెథడ్రిల్ చర్చిలో శుక్రవారం పునీత రాయప్ప ప్రధాన దేవాలయం విచారణకర్త రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ నేతృత్వంలో రక్షణగిరి పుణ్యక్షేత్ర మహోత్సవం, క్రీస్తు రక్షకుని యాత్రా ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో ఫాదర్ సరసా ప్రతాప్ పతాకావిష్కరణ చేశారు. జపమాల, దివ్యబలి పూజలు నిర్వహించారు. అనంతరం నవదిన ప్రార్థనలు ప్రారంభించారు. స్వస్థత ప్రార్థన కూటమి ప్రార్థనలు చేశారు. పుర:ప్రదక్షిణ, బైబిల్ పదకేళి పోటీలు నిర్వహించారు. 9 రోజుల పాటు జరగనున్న ఈ పోటీల్లో విజేతలకు మే 14న బహుమతి ప్రదానం చేస్తారు. కార్యక్రమంలో రక్షణగిరి పత్రిక సంపాదకులు ఆదిరెడ్డి అల్బర్ట్, పీపీసీ (పారిస్ పాస్టల్ కౌన్సిల్) సభ్యులు ఆమర్, ఆదిరెడ్డి చార్లీ, ఆనందరావు, బేతా రాణిజోసెఫ్, గురు మండలి సలహా సంఘం సభ్యులు, క్రైస్తవ సోదరులు తదితరులు పాల్గొన్నారు.


పతాకాన్ని ఎగురవేస్తున్న ఫాదర్ సరసా ప్రతాప్

రాజన్న ఆటోనగర్ అధ్యక్షునికి సత్కారం


పటాన్ ఖాజావలిని సత్కరిస్తున్న ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ త్రినాథ్

జగదాంబ: రాజన్న ఆటోనగర్ యూనియన్ ప్రెసిడెంట్‌గా ఎంపికైన పటాన్ ఖాజావలిని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ త్రినాథ్ సత్కరించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 2500 మందికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఉపాధినిచ్చారన్నారు. ఈ సందర్భంగా సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి వచ్చిన రాజన్న ఆటోనగర్ మంజూరి పత్రాన్ని అందజేశారు. ఖాజావలి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్నకు కృతజ్ఞతలు తెలిపారు. రాజన్న ఆటోనగర్ సభ్యులందరూ ప్రెసిడెంట్ కార్యాలయానికి వచ్చి వారి ఐడీ వివరాలు పరిశీలించుకోవవాలని కోరారు.

అలరించిన గాత్ర కచేరీ

సీతంపేట: వైశాఖ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం లలితానగర్ లలితా పీఠంలో కర్ణాటక గాత్ర కచేరీ నిర్వహించారు. వీరగంట లలితా చంద్రశేఖర్ శిష్యురాలు కొంపెల్ల లక్ష్మి శారద తన అద్భుత గాత్రంతో ప్రేక్షకులను అలరించారు. నీవే నన్ను, శ్రీవిష్ను రాజం భజే, గౌరీ సుకుమారి, శ్రీకమలాంబికే, పామర జానపాలిని, మంగళదాయిని వంటి ముత్తుస్వామి దీక్షితార్, బాల సుబ్రహ్మణ్యం ఆలపించిన పలు గీతాలను పాడి భక్తులను ఆకట్టుకున్నారు. ఈమెకు సరస్వతుల పార్థివ వయోలిన్‌పై, చైతన్య తాలాడ మృదంగంపై వాద్య సహకారం అందించారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణ సేన్ గాయని శారదను సత్కరించి అభినందించారు.


కీర్తనలు ఆలపిస్తున్న గాయని శారద